దుమ్ముతో సతమతం



కమాన్‌పూర్ నుంచి కల్వచర్ల మీదుగా ఆదివారంపేట వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత జనవరిలో రూ. 34 కోట్లతో పనులు ప్రారంభించగా రత్నాపూర్ వంతెన వరకు పూర్తి చేశారు. మధ్యలో మురుగు కాలువలు, కల్వర్టుల వద్ద వదిలేశారు. నాలుగు నెలలుగా పనులు నిలిచి విపరీతమైన దుమ్ము లేస్తోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ట్యాంకర్లతో నీటిని సక్రమంగా పట్టడం లేదని ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వర్షాలతో పనులకు ఆటంకం కలిగిందని, తగ్గుముఖం పట్టినందున వేగవంతం చేశామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

-న్యూస్‌టుడే, కమాన్‌పూర్(సెంటినరీకాలనీ)

దారి పక్కన పొంచిన ఆపద



మంథని పోచమ్మవాడ ప్రాంతంలో రహదారి పక్కన విద్యుత్తు స్తంభం వంగిపోయి తీగలు ప్రమాదకరంగా మారాయి. శ్రీపాదకాలనీ ఉపకేంద్రం నుంచి మంథని 11 కేవీ టౌన్ ఫీడర్‌కు విద్యుత్తు సరఫరా చేసే స్తంభం వంగిపోయి తీగలు కిందకు జారాయి. ఈ ప్రాంతంలో ఓ గురుకుల పాఠశాల, రెండు పడక గదుల ఇళ్ల సముదాయం, రెండు శుభకార్యాల వేదికలున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో తీగలు, స్తంభం ప్రమాదకరంగా మారడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

కొనుగోళ్లు ఎప్పుడైనా స్థలం మాదే!



వరి కోతలు ప్రారంభించకముందే రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని స్థలాలను రిజర్వు చేసుకుంటున్నారు. సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రతి సీజన్‌లో పట్టణంలోని మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు. 20 రోజుల్లో కోతలు ప్రారంభం కానుండగా కొందరు తమ పేర్లు, పాత గోనె సంచులు, ఊక, బండరాళ్లతో స్థలాలు అట్టి పెట్టుకుంటున్నారు. **-న్యూస్‌టుడే, సుల్తానాబాద్**

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 1:3 ప్రాతిపదికన ఎంపిక చేసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. పెద్దపల్లి ఎంఈవో కార్యాలయంలో రెండు రోజులుగా ఆరు బృందాలు పరిశీలిస్తున్నాయి. జిల్లాలో 93 పోస్టులు ఖాళీగా ఉండగా మొత్తం 279 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. గురువారం సాయంత్రం వరకు 85 మంది హాజరయ్యారు.



ఎంఈవో కార్యాలయంలో ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

ఇష్టం లేకున్నా హాజరు కావాల్సిందే

సబ్జెక్టు వారీగా అభ్యర్థుల విద్యార్హత, ఇతర ధ్రువపత్రాలను తనిఖీ చేస్తున్నారు. మెరిట్ అభ్యర్థుల జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలంటూ అభ్యర్థుల ఫోన్‌లకు సందేశం పంపిస్తున్నారు. ఇతర ఉద్యోగాల్లో స్థిరపడినా లేక ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరడానికి ఇష్టం లేకుంటే ఆ విషయాన్ని(నాట్ విల్లింగ్) స్వయంగా హాజరై రాతపూర్వకంగా తెలపాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

కుటుంబ డిజిటల్ సర్వే ప్రారంభం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక ప్రాంతంలోని 48వ డివిజన్‌లో కుటుంబ డిజిటల్ సర్వేను జిల్లా అదనపు పాలనాధికారిణి, నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ అరుణశ్రీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికి తిరుగుతూ చేపడుతున్న సర్వే తీరును పరిశీలిస్తూ అవసరమైన సూచనలిచ్చారు. కార్పొరేటర్ విద్య, అధికారులు కరుణాకర్, సునీల్‌రాథోడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

ముగిసిన కాలం.. ఉబికిన జలం

జిల్లాలో 14 శాతం అధికంగా వర్షపాతం

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

సెప్టెంబరు నెలాఖరుతో వానాకాలం ముగిసింది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా వర్షపాతం ఆశాజనకంగా ఉంది. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు నెలల్లో ఒక్క ఆగస్టులో మాత్రమే లోటు ఏర్పడింది. మూడు నెలల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ వానాకాలంలో జిల్లాలో 14 శాతం అధికంగా వర్షం కురిసింది. దీంతో భూగర్భ జలాలు పైపైకి ఉబికి వస్తున్నాయి. గత నెలతో పోలిస్తే స్వల్పంగా నీటి మట్టం తగ్గినప్పటికీ యాసంగి సాగు అవసరాలకు భరోసా ఏర్పడింది.

2.60 లక్షల ఎకరాల్లో పంటలు

ఈ ఏడాది తొలకరి ముందుగానే పలకరించినా జులై రెండో వారం ఆరంభంలో భారీ వర్షాలు కురిశాయి. జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి నీరు సమృద్ధిగా చేరడంతో మానేరు, హుస్సేన్‌మియా వాగులు, గోదావరి ఉప్పొంగి ప్రవహించాయి. ఆగస్టులో మాత్రం వరుణుడు ముఖం చాటేయడంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. నాలుగు నెలల్లో సాధారణం 886 మి.మీ. కాగా 1,013.9 మి.మీ నమోదైంది. ఈ వానాకాలంలో దాదాపు 2.60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి.

ఈ సీజన్‌లో వర్షపాతం (మి.మీ.లలో)

నెల	సాధారణం	కురిసింది
జూన్	161.8	192.7
జులై	292.4	443.7
ఆగస్టు	244.1	171.5
సెప్టెంబర్	177.5	204.6



ముత్తారం మండలంలో చేతికందేంత లోతులో బావిలో నీరు

3.89 మీటర్ల లోతులో నీరు

గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. జిల్లాలో ప్రతి నెలా 33 పిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3.89 మీటర్ల లోతులో నీటి మట్టం ఉబికివస్తోంది. అత్యల్పంగా అంతర్గాం మండలం మొఘల్‌పహాడ్‌లో 1.03 మీటర్ల లోతులో ఉండగా, అత్యధికంగా మంథని మండలం వెక్లాస్‌పూర్‌లో 18.70 మీటర్ల లోతులోకి వెళ్లింది. గత నాలుగు నెలల గణాంకాలు పరిశీలిస్తే భూగర్భ జల మట్టం రెట్టింపు స్థాయికి ఎగిసింది.

నెల వారీగా భూగర్భ జల మట్టం (మీటర్లలో)

నెల	మీటర్లు
జూన్:	6.65
జులై:	3.52
ఆగస్టు:	3.68
సెప్టెంబరు:	3.89



గాడుదుల గండి గుట్ట వద్ద రహదారిపైకి వచ్చిన చెట్ల కొమ్మలు

ప్రధాన మార్గం.. ప్రమాదకర ప్రయాణం

మంథని మండలం ఎక్లాస్‌పూర్-కాటారం మార్గంలో పలు చోట్ల చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు రహదారిపైకి చొచ్చుకొచ్చి ప్రమాదకరంగా మారాయి. గాడుదలగండి గుట్టకు మలుపుల వద్ద ఇరువైపులా కొమ్మలు ఏపుగా పెరిగాయి. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల వంగిపోయి రహదారిపైకి వచ్చాయి. గుట్ట దాటిన అనంతరం ఖాన్‌సాయిపేట వరకు వరకు రహదారికి ఇరువైపులా తుమ్మలు, తీగజాతి, పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రమాదాలు జరగకముందే కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై గురువారం సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన దృశ్యమాధ్యమ సమీక్షకు జిల్లా నుంచి కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్, జిల్లా అధికారులు హాజరయ్యారు. ధాన్యం సేకరణతో పాటు డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, నియామక ఉత్తర్వులకు సంబంధించిన అంశాలపై సీఎం సమీక్షించారు. ఈసారి సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేసేలా కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రానికి సీరియల్ నెంబరు వేయడంతో పాటు ధాన్యాన్ని మిల్లులకు తరలించే సమయంలో బస్తాలపై ఆ నెంబరు వేయాలన్నారు. గన్నీ సంచులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్ కవర్లు కవర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరణపై రోజువారీగా సమీక్షించడంతో పాటు క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేసే వారిపై అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్సీ ఫలితాల్లో 1:3 ప్రాతిపదికన ఎంపిక చేసిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అక్టోబరు 9న సాయంత్రం 4 గంటలకు నియామక పత్రాలు అందజేయాలన్నారు. దసరా పండుగకు ముందే నియామక ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం సూచించారు.



సమీక్షలో కలెక్టర్ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, జిల్లా అధికారులు

నేర దర్యాప్తులో మరింత శాస్త్రీయత

గోదావరిఖని, న్యూస్‌టుడే: పోలీసు వృత్తిలో మరింత నైపుణ్యం పెంపొందించుకునేందుకు రాష్ట్రంలో 'పోలీసు డ్యూటీ మీట్' నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ వెల్లడించారు. కాళేశ్వరం జోన్ పరిధిలోని అయిదు జిల్లాల పోలీసులకు కమిషనరేట్ హెడ్ క్వార్టర్‌లో గురువారం పోలీసు డ్యూటీ మీట్ నిర్వహించారు. విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర దర్యాప్తులో మరింత శాస్త్రీయత సాధించే దిశగా అవగాహన కల్పించారు. సీపీ మాట్లాడుతూ. . క్షేత్రస్థాయిలో నేర విచారణకు ఎదురయ్యే అంశాలకు సంబంధించి విధులపై ప్రదర్శన చేయడం ద్వారా మెలకువలు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ సమావేశంలో.. నేర విచారణకు సంబంధించిన పలు అంశాలపై ప్రదర్శన ఇచ్చారు. డీసీపీ భాస్కర్, అదనపు డీసీపీ రాజు, ఏసీపీలు వెంకటస్వామి, ప్రతాప్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.



'పోలీసు డ్యూటీ మీట్‌ను' ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. కమిషనరేట్ పరిధిలో రెండు షీటీం బృందాలు పనిచేస్తున్నాయని వివరించారు. షీ టీం నంబరు 6303923700తోపాటు 100 డయల్ వినియోగించుకోవాలన్నారు. గతనెలలో 8 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో రెండు కేసులు నమోదు చేశామన్నారు. మరో నాలుగు కేసుల్లో తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని, మరో రెండు కేసులకు సంబంధించి విచారణ కోసం పంపించామని తెలిపారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

గోదావరిఖని: దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసు కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. దుర్గాదేవి ప్రతిష్ఠించిన మండపాల నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్తు అనుమతి తీసుకోవడంతోపాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు, కరపత్రాలు ముద్రించకూడదని హెచ్చరించారు.



సాంకేతికత.. సృజనాత్మకత



న్యూస్‌టుడే, కరీంనగర్ కల్చరల్

వాహన చోదకుడు నిద్ర పోకుండా అలారంతో అప్రమత్తం చేసే కళ్లజోడు.. మట్టిలోని తేమ తగ్గితే మోటారును ఆన్ చేసే పరికరం.. పరికరాన్ని తాకితే ఆగిపోయే మోటారు.. భూగర్భ గనుల్లో విషవాయువులను గుర్తించి కార్మికులను హెచ్చరించే హెల్మెట్.. విద్యుదాఘాతం, విద్యుత్తు వృథాను తగ్గించే నీటి హీటర్.. ఇలా ఎన్నో సాంకేతిక పరికరాల తయారీకి విద్యార్థులు, యువతీ యువకులు మేధస్సుకు పదును పెట్టారు. ప్రజా సమస్యలకు తమవంతుగా పరిష్కారం చూపుతూ సృజనాత్మకత చాటారు. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాల్లో భాగంగా ఇటీవల కరీంనగర్ పురాతన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళాలో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులపై 'న్యూస్‌టుడే' కథనం.

1 ప్రదర్శన పేరు 2 భాగస్వాములైన విద్యార్థులు 3 కళాశాల/పాఠశాల 4 పని చేసే విధానం 5 ఉపయోగం

రైతు కష్టాన్ని తగ్గించి.. ప్రమాదాలు దూరం



1 ఆటోమేటిక్ తేమ డిటెక్టివ్ మోటార్
2 నక్షత్ర, ఆర్.జ్యోత్స్న, కె.వర్షిత ప్రియ
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 తేమ సెన్సార్లను భూమిలో పాతిపెట్టి డివైస్‌ను ఏర్పాటు చేయాలి. పంట పొలాల్లో తేమ తగ్గితే వెంటనే మోటార్‌ను ఆన్ చేసి సరిపడిన నీరు అందించి.. తర్వాత మోటార్‌ను ఆఫ్ చేస్తుంది.
5 రైతులకు విద్యుదాఘాతం నుంచి రక్షణతోపాటు శ్రమ తగ్గుతుంది. సకాలంలో పంటకు నీరు అందించడంతో దిగుబడి పెరుగుతుంది. రైతు పంట పొలానికి వెళ్లాల్సిన అవసరం లేదు. నీరు వృథా కాదు.

స్విచ్ వేయకుండానే తిరిగే పంకాలు, వెలిగే లైట్లు



1 హోమ్ ఆటోమేషన్ పరికరాలు 2 జి.అఖిల, ఎ.శ్రీనిత్య
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 ఇంట్లో ఫ్యాన్లు, దీపాలు, సంపు మోటారు ఎలక్ట్రానిక్ వస్తువులకు ఈ పరికరాన్ని అనుసంధానం చేయాలి. చేతితో ముట్టుకోకుండా అరచేతులు కొట్టినా, మాట వినిపించినా వస్తువులన్నీ ఆన్ అవుతాయి.. వద్దనుకుంటే ఆఫ్ అవుతాయి.
5 విద్యుదాఘాతం నుంచి రక్షణ, ఇంట్లో మహిళలు, వృద్ధులకు అనుకూలమైంది. విద్యుత్తు ఆదా. శ్రమ తగ్గుతుంది.

డ్రైవర్ నిద్రపోకుండా.. అప్రమత్తం చేసేలా..



1 డ్రైవర్‌ను మేల్కొల్పే అలారం 2 పి.సాహితీ, ఎం.అఖిల
3 తిమ్మాపూర్ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల
4 నిద్రలేకనో, అలసిపోయో డ్రైవర్లు నిద్రలోకి జారుకుంటే (మూడు సెకన్ల కంటే ఎక్కువ సమయం దాటితే) కళ్లద్దాలు గుర్తించి అలారం మోగి.. డ్రైవర్లను అప్రమత్తం చేస్తాయి. అంతటితో ఆగకుండా ఇంజిన్ వద్ద ఉన్న డివైస్ వాహన వేగాన్ని తగ్గిస్తుంది.
5 రోడ్డు ప్రమాదాల నివారణ. ప్రాణాలకు రక్షణ

గని కార్మికులకు రక్షణ..




1 మైనింగ్ సేఫ్టీ క్యాప్
2 ఎం.జాహ్నవి, జి.భావన
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 గనుల్లో పని చేస్తుండగా విషవాయువులు బయటకు వస్తున్నప్పుడు కార్మికులు ఈ క్యాప్ ధరించి ఉంటే ప్రమాదం నుంచి బయటపడొచ్చు.
5 అలారం మోగిన వెంటనే కార్మికుడు అప్రమత్తమై మాస్కులు, ఆక్సిజన్ ధరిస్తే ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు.

ప్రమాద రహిత వేడి నీటి యంత్రం



1 అధునాతన హీటర్
2 ఎం.శ్రుతి, బి.చరణ్
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 హీటర్‌కు పరికరాలను అమర్చి.. నీటిలో ఉంచినప్పుడు సెన్సార్లు లవణాలను గుర్తించి విద్యుత్తు ప్రవహించి వేడిగా అవుతుంది. దానిని బయటకు తీస్తే సెన్సార్లకు లవణాలు అందకపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోతుంది.
5 ఇంట్లో పిల్లలు, మహిళలు విద్యుదాఘాతం బారిన పడకుండా చూసుకోవచ్చు. ప్రమాదాలు, ఆస్తి నష్టం జరగదు.

భూమిలో కరిగే సంచి



ఎకో లాస్టిక్ సంచులలో పెంచిన మొక్కలు



నేను ప్లాస్టిక్ కాను అని రాసి ఉన్న సంచి

రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేలా నగరపాలక సంస్థ అడుగులేస్తోంది. నర్సరీల్లో ఏటా లక్షల్లో మొక్కలు నాటేందుకు విత్తనాలు వేసి మొక్కలు పెంచడానికి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులకు బదులుగా ఎకో లాస్టిక్ బ్యాగులు వినియోగంలోకి తెచ్చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలోచన విధానాలకు అనుగుణంగా మేయర్ సునీల్‌రావు, అప్పటి కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ చొరవతో భూమిలో కరిగి పోయే బ్యాగులను వాడేందుకు మొగ్గు చూపారు. పద్మనగర్ సమీపంలోని బుల్ సెమన్ సెంటర్‌లోని నర్సరీలో 20 వేల సంచులలో మొక్కలు నాటారు. వీటిని ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. ఈ సంచి నాలుగు నెలల్లోనే భూమిలో కరిగిపోయి ఎరువుగా మారుతోందని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, కరీంనగర్ సుభాష్‌నగర్

కొత్తపత్తి గరిష్ఠ ధర రూ.6,900

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 18 ట్రాలీల కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,900 ధర పలికింది. 3 ట్రాలీల పాత విడి పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.7,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. బస్తాల కొత్తపత్తికి రూ.5,000 నుంచి రూ.6,600 ధర పలికింది. మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం బిడ్డింగ్‌ను పరిశీలించారు. అధిక తేమశాతంతో పత్తి ధర తక్కువ పలుకుతుందని ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి 8 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం : శ్రీరామసాగర్‌కు ఎగువ నుంచి 8525 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులో 1091 అడుగులు, 80.501 టీఎంసీల నీరు నిలువ ఉండగా, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతీ కాలువలకు 500, గుత్పకు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వరద ఎక్కువగా రాక పోవడంతో గేట్లను మూసివేశారు.

క్రిప్టో మాయ!

లాభాలు వస్తాయని జనం పెట్టుబడులు ◆ కొన్ని యాప్‌లు మూసివేస్తున్నా మారని తీరు

న్యూస్‌టుడే, మేడిపల్లి



రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ సామాన్య, మధ్యతరగతి వారిని ఆకర్షిస్తోంది. క్రిప్టో కరెన్సీ పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్న మార్కెటింగ్ వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. నిర్మల్ జిల్లాలో క్రిప్టోకరెన్సీ ఏజెంట్లపై కేసులు నమోదు కావడంతో ఆన్‌లైన్ పెట్టుబడులు తిరిగి వస్తాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. తమకు లాభాలు వచ్చాయని కొందరు చెబుతుంటే.. చాలా మంది నష్టపోయారని జరుగుతున్న ప్రచారం మధ్య పెట్టుబడిదారులు అయోమయంలో ఉన్నారు. పదుల సంఖ్యలో యాప్‌ల ద్వారా వ్యాపారం జరగడం... ఇందులో కొన్ని మూతబడినట్లు చెబుతుండటంతో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది.

■ కోరుట్లలో హార్వెస్టర్‌లు రెండూ అమ్మేసి ఓ వ్యక్తి పెట్టుబడి పెట్టాడు. వాటి రికవరీ కోసం మరి కొంతమందిని చైన్ లింకింగ్‌లో చేర్పించేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడు.

■ పెగడపల్లి మండలంలోని ఓ గ్రామంలో పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాలు తేడా లేకుండా ఇంటింటికీ పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.

■ కోరుట్లలోనే ఓ వ్యాపారి రూ.కోటికి పైగా పెట్టుబడి పెట్టినట్లు ప్రచారం జరుగుతుండగా కొద్దిశాతం తిరిగి వచ్చినట్లు చెబుతున్నారు.

■ మేడిపల్లి మండలంలోని రెండు మూడు గ్రామాల్లో ఈ తరహా పెట్టుబడులు పెద్దఎత్తున పెట్టగా కొందరు దేశ, విదేశాల ట్రిప్పులు తిరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

■ తాము పెట్టుబడి పెట్టిన యాప్ ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఇటీవల జగిత్యాలకు చెందిన ఓ ఏజెంట్ వద్దకు పలువురు పరుగులు తీశారు. తాను కూడా మోసపోయానని ఏజెంట్ చెప్పినా బాధితులు వినకపోవడంతో గొడవ జరిగినట్లు తెలిసింది.

■ జగిత్యాల జిల్లా కోరుట్ల, మల్యాల, పెగడపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి ప్రాంతాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.

సార్లు... స్టార్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ ఏజెంట్లుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేయగా ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయుల పాత్ర పైనా చర్చ జరుగుతోంది. ఆయా జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు ఇటీవల విదేశాలకు వెళ్లినట్లు తెలిసింది. ఉద్యోగులు ఇతర దేశాలకు వెళ్లాలంటే శాఖాపరమైన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పలువురు నిబంధనలకు వ్యతిరేకంగా విదేశాలకు వెళ్లడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ చైన్‌లింకింగ్ విస్తరించిన కొద్దీ 3 స్టార్, 5 స్టార్, 7 స్టార్... ఇలా గుర్తింపు ఇస్తారు. పలువురు సార్లు స్టార్లుగా ఎదిగే ప్రయత్నంలో నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది.



రియల్.. ధమాల్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముఖ్యంగా జగిత్యాల జిల్లాలో భూములకు సంబంధించిన లావాదేవీలపై క్రిప్టో కరెన్సీ ప్రభావం పడింది. పొరుగునే ఉన్న ఆర్మూరు, నిర్మల్, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో చైన్ లింకింగ్ కొనసాగుతుండటం, అధిక వడ్డీ ఆశించి పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. 8 నుంచి 12 నెలలుగా బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ పేరిట అమాయకులను పలువురు ఆకర్షించడంతో సామన్యులు కూడా పెట్టుబడులు పెడుతున్నారు. కొన్ని కరెన్సీలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఉండటంతో అవి తిరిగి వస్తాయా లేదా అని తెలియకున్నా చాలా మంది పెట్టుబడులు పెట్టారు. చాలా మంది భూములు తనఖా పెట్టి, అప్పులు తెచ్చి చైన్‌లింకింగ్‌లో చేరారు. గతంలో క్యూనెట్ పేరిట మోసపోయినా ఈ విడత పలు యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి కొందరు మోసపోగా మరికొందరు తమ పెట్టుబడి తిరిగి వస్తుందా లేదా అనే మీమాంసలో ఉన్నారు. రూ.లక్ష నుంచి పెట్టుబడులు పెట్టిన వారికి నెలకు కొంత మొత్తంలో రిటర్న్స్ వస్తుండటంతో చాలా మంది పెట్టుబడుల కోసం ఎగబడ్డారు. లాభాల ఆశతో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టిన వారూ ఉన్నారని ప్రచారం జరుతుతుండటం విశేషంగా చెప్పుకుంటున్నారు. కొన్ని నెలలు సజావుగా లావాదీవీలు జరిగినా సంబంధిత యాప్ ఆన్‌లైన్‌లో కనిపించని సందర్భాల్లో లబోదిబోమంటున్నారు. కేవలం జగిత్యాల జిల్లాలో రూ.800 నుంచి రూ.1,000 కోట్ల వరకు క్రిప్టోకరెన్సీలో పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం జరుగుతుండటం, ఇదే సమయంలో రియల్ వ్యాపారం దెబ్బతినడంతో ఊహాగానాలకు ఊతమిచ్చినట్లవుతోంది.

పేర్లు ఏవైనా... పెట్టుబడులే లక్ష్యం

ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెట్టడమే కానీ మోసం జరిగితే ఎలా ముందుకు పోవాలో తెలియకున్నా ఊళ్లకు ఊళ్లే గొలుసుకట్టులో పెట్టుబడులు పెడుతున్నారు. ఇటీవల వీఎంటీ, రెక్సోర్స్ యాప్స్ పేరిట పలువురు ఏజెంట్లు పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. రూ.లక్ష పెట్టుబడిగా పెడితే నెలకు రూ.16 వేలు వస్తాయని చెప్పడంతో పలువురు ముందుకు వచ్చారు. కొందరికి నెలనెలా రూ.16 వేల చొప్పున వచ్చాయని చెప్పడంతో నిజమో కాదో తెలియకున్నా మరింత మంది పెట్టుబడులు పెట్టారు. ఈ చైన్‌లింకింగ్‌లో కమీషన్ పెరిగిన కొద్దీ ఏజెంట్లకు స్టార్లు పెరుగుతూ వస్తాయి. 5 స్టార్ వచ్చిన వారికి రూ.2 కోట్ల వరకూ వస్తాయని చెప్పడంతో ఎక్కువ మంది పెట్టుబడుల కోసం ఎగబడుతున్నారు. చైన్ లింకింగ్‌లో టార్గెట్ చేరుకున్న ఏజెంట్లు, రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టినవారు జపాన్, యూకే, సింగపూర్, బ్యాంకాక్ తదితర దేశాలు ట్రిప్పుల పేరిట తిరిగి వస్తున్నారు. దేశంలోని గోవా లాంటి పర్యాటక ప్రాంతాలకు ఒక్కో విమానాన్ని బుక్ చేస్తుండటం, వాటిల్లో ఏజెంట్లను తిప్పుతుండటం ఈ వ్యాపారంకు ఉన్న క్రేజీని తెలుపుతోంది. గతంలో చాలా మంది క్యూనెట్ ద్వారా కూడా చైన్ లింకింగ్ పేరిట పెట్టుబడి పెట్టి మోసపోయారు. అయినా ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పెట్టుబడులు సురక్షితమో కాదో తెలియకున్నా చాలా మంది అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెడుతున్నారు.

భార్య దూరమై.. మద్యానికి బానిసై

ఒంటరితనంతో మేస్త్రీ ఆత్మహత్య



రాంప్రసాద్

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నాలుగేళ్ల కిందట పెళ్లయింది.. సంతానం లేదు.. రెండు నెలల కిందట జ్వరం బారిన పడి భార్య మృతి చెందింది.. ఒంటరితనం భరించలేక అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు.. చివరికి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు.. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన కుర్మ రాంప్రసాద్(28), ప్రణవి దంపతులకు సంతానం లేదు. అతడు మేస్త్రీ పని చేస్తుండగా భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. రెండు నెలల కిందట ప్రణవి జ్వరం బారిన పడింది. చికిత్స పొందుతూ డెంగీ లక్షణాలతో మృతి చెందింది. భార్య మరణం రాంప్రసాద్‌ను తీవ్రంగా కుంగదీసింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: కుక్కల దాడిలో ఏడుగురు గాయపడిన ఘటన జమ్మికుంట ప్రాంతంలో చోటుచేసుకుంది. బుధవారం కోరపల్లికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అక్షర ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అదే రోజు అదే గ్రామానికి చెందిన పి.గట్టమ్మ, గండీ స్వరూపలు కుక్కల దాడిలో గాయపడ్డారు. గురువారం కోరపల్లికి చెందిన రాజశేఖర్, టి.రాజమల్లు, పొల్సాని కృతిక్‌రావు, జమ్మికుంట పుర పరిధి కొత్తపల్లికి చెందిన రమ కుక్క కాటుకు గురయ్యారు. అక్షర పెదవి వద్ద తీవ్రగాయం కావడంతో కుటుంబీకులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రెండు రోజుల వ్యవధి కోరపల్లిలో కుక్కల దాడిలో ఏడుగురు గాయపడటంతో గ్రామస్థులు పంచాయతీ భవనం వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామంలో పిచ్చికుక్కలను చంపేయాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. కుక్కల తీవ్రతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించానని.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని గ్రామ పంచాయతీ కార్యదర్శి తారకరామారావు తెలిపారు.

రాగి తీగ చోరీ కేసులో నిందితుల అరెస్టు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు దుకాణంలో రాగి తీగ చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ గురువారం సుల్తానాబాద్ ఠాణాలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. శాస్త్రీనగర్‌లోని నరేందర్‌రెడ్డికి చెందిన దుకాణంలో సెప్టెంబరు 23న అర్ధరాత్రి దొంగలు చొరబడి 300 కిలోల రాగి తీగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన గుర్రాల చిన్నభూమయ్య, పిట్టల సురేందర్, సిలివేరి శంకరయ్య, కడమండ శ్రీకాంత్, బెల్లంపల్లికి చెందిన గోషిక కార్తీక్‌లు ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దొంగిలించిన 300 కిలోల రాగిని ఆటోలో బెల్లంపల్లికి తరలించి పసుపులేటి శ్రీనివాస్‌కు 250 కిలోలు అమ్మి రూ.లక్ష తీసుకొని పంచుకున్నారు. 50 కిలోల రాగిని చిన్నభూమయ్య తన వద్దే ఉంచుకున్నాడు. వ్యాపారి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 250 కిలోల రాగి నుంచి 50 కిలోలను హైదరాబాద్‌కు చెందిన రాముకు విక్రయించాడు. నిందితులు సురేందర్, శంకరయ్య, శ్రీకాంత్, కార్తీక్, శ్రీనివాస్‌లను గురువారం అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్రవాహనం, 200 కిలోల రాగిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గుర్రాల చిన్నభూమయ్య, హైదరాబాద్‌కు చెందిన రాము పరారీలో ఉన్నారు. పిట్టల సురేందర్, సిలివేరు శంకరయ్య గతంలో మందమర్రి, మంథని, కాటారం ఠాణాల్లో నమోదైన దొంగతనం తదితర కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కేసును ఛేదించిన సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అన్నను చంపిన తమ్ముడు..

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్‌రాజును హత్య చేసిన అతని సోదరుడు విక్రమ్‌రాజును గురువారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న ఇంటి వద్ద భూతగాదాలతో అన్నను రోకలి బండతో మోదీ తమ్ముడు హత్య చేశాడని నిందితుడి కోసం గాలించగా అంతర్గాం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. దాచిపెట్టిన రోకలి బండను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కరీంనగర్ విద్యావిభాగం : ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు జిల్లాలో గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సమయంలో జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సి.హెచ్.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం జరిగిన పదో తరగతి పరీక్షకు 54 మందికిగాను 31 మంది, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ పరీక్షకు 48 మందికిగాను 31 మంది హాజరయ్యారని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

వీరి పరుగు ఆగదు..

సత్తా చాటిన పోలీసులు

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 21 కిలోమీటర్లు పరుగు తీయాలంటే కొంచెం కష్టమే. కానీ ఈ పోలీసులకు అది సులువు. హాఫ్ మారథాన్(21 కిలోమీటర్లు) పరుగెత్తి సత్తా చాటారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. రామగుండం, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు పరుగుపై దృష్టి సారించారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ప్రతిభ చాటిన వీరిపై 'న్యూస్‌టుడే' కథనం.

మరిన్ని మారథాన్‌లకు హాజరవుతా..



ఏఆర్ కానిస్టేబుల్ బుర్ర వంశీ.. నిత్యం సాధన ద్వారా హాఫ్ మారథాన్‌ను సులువగా అధిగమించారు. ఇప్పటికే కొన్ని పరుగు పందెల్లో పాల్గొని తన సత్తా చాటారు. మరిన్ని పరుగు పందెలు, మారథాన్‌లకు హాజరవుతానని తెలిపారు.

- వంశీ

నిరంతర సాధనతోనే సాధ్యం..



రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ నలిగొండ అంజయ్య హాఫ్ మారథాన్ పూర్తి చేశారు. 21 కిలోమీటర్లను సునాయసంగా పూర్తిచేసిన అంజయ్య.. గతేడాది నిర్వహించిన మారథాన్‌లో ప్రతిభ చాటారు. పోలీసు మీట్‌లోనూ 5 కిలోమీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారు. నిరంతరం సాధన చేయడం ద్వారా హాఫ్ మారథాన్ సులువుగా అధిగమించగలిగానని వెల్లడించారు.

- అంజయ్య

తోటి ఉద్యోగుల స్ఫూర్తితో.. - వెంకటేశ్



పరుగు పూర్తి చేస్తాననే నమ్మకం లేనప్పటికీ.. తోటి ఉద్యోగుల స్ఫూర్తితో విజయం సాధించానని మిడిదొడ్డి వెంకటేశ్ తన అనుభవాన్ని తెలిపారు. తొలి ప్రయత్నంలోనే హాఫ్ మారథాన్ అధిగమించినట్లు రామగుండం కమిషనరేట్ పరిధి కానిస్టేబుల్ వెల్లడించారు. ఉద్యోగంలో చేరిన తరువాత పరుగుపై దృష్టి సారించలేదని.. మారథాన్‌లో పాల్గొనాలని తోటి మిత్రుల సూచన మేరకు సాధన చేశానన్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది - శ్రీకాంత్



తొలిసారిగా కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో పాల్గొని ప్రతిభను వెలికి తీశారు.. ఏఆర్ కానిస్టేబుల్ రాళ్లబండి శ్రీకాంత్. రామగుండం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ తొలి ప్రయత్నంలోనే విజయవంతమయ్యారు. దీంతో మరింత ఆత్మస్థైర్యం పెరిగిందని, రానున్న కాలంలో మరిన్ని పోటీలకు హాజరవుతానన్నారు.

మరింత ప్రయత్నం చేస్తాను - రవి



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న కరీంనగర్ రూరల్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ రవి.. తొలిసారి హాఫ్ మారథాన్‌లో పాల్గొని 10 కిలోమీటర్లు పూర్తిచేశారు. ఇందులో పాల్గొనడంతో తనకున్న శక్తి తెలిసిందన్నారు. ఇకపై మరింత సాధన, ప్రయత్నం చేస్తూ.. మారథాన్‌లో పాల్గొంటానన్నారు.

న్యూస్‌టుడే – ఓదెల

? ఓదెల మండలకేంద్రంలోని పలు వార్డుల్లో మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. -కుమారస్వామి, ఓదెల

✔ వార్డుల్లో పరిశీలించి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను, పూడికను పారిశుద్ధ్య సిబ్బందితో వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

భూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

కాల్వశ్రీరాంపూర్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. గురువారం ఆయన కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై ధరణి పెండింగ్ సమస్యలు, భూసేకరణ, ధ్రువపత్రాల జారీ తదితర అంశాలపై సమీక్షించారు. తహసీల్దార్ వకీల్, ఉప తహసీల్దార్ శంకర్, ఆర్ఐలు రాజేందర్, అజీమ్, సిబ్బంది పాల్గొన్నారు.

లోవోల్టేజీ లేకుండా చూడాలి


మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ధర్మారం, న్యూస్‌టుడే: ధర్మారం వ్యవసాయ మార్కెట్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని స్థానిక రైతులు గురువారం కార్యదర్శి సరోజకు వినతి పత్రం అందజేశారు. కొద్ది రోజుల్లో ధాన్యం మార్కెట్‌కు రానుంది. ధాన్యంలో తప్పుతాలు వేరుచేసేందుకు వినియోగించే ప్యాడీ క్లీనర్‌లకు విద్యుత్తు సరిపోక కాలిపోతున్నాయన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు


రాఘవాపూర్ వృద్ధాశ్రమంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా గురువారం రాఘవాపూర్‌లోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు రాజమౌళి, మమత, ప్రసన్న, మధుసూదన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కరీంనగర్‌లో ఈ నెల 2న నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ట్రినిటి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-14 కేటగిరీలో సాత్విక్, శివశంకర్, అద్విత్, రూపక్, కృష్ణరేవంత్, అండర్-17 కేటగిరీలో మనిహాస్, వర్షిత్, అభిశ్రీశిత్, బాలికల విభాగంలో భవాని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 5, 6 తేదీల్లో వీరు పోటీల్లో పాల్గొననున్నారు. విద్యాసంస్థల ఛైర్మన్ మనోహర్‌రెడ్డి వారిని అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్ సింగ్. చిత్రంలో జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి ప్రభావిత గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఆర్జీ-1 పరిధిలోని మేడిపల్లి ఓసీపీ ప్యాకేజీ కింద.. మల్కాపూర్, పాములపేట, లింగాపూర్, మేడిపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శిలాఫలకాలు ఆవిష్కరించారు. సింగరేణికి భూములు త్యాగం చేసిన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీఎం తెలిపారు. అధికారులు రాంమోహన్, కిరణ్‌బాబు, వెంకటేశ్వర్‌రావు, ఆంజనేయప్రసాద్, వరప్రసాద్, ప్రభాకర్, కర్ణ, హన్మంతరావు, కార్పొరేటర్లు కృష్ణవేణి, శ్రీనివాస్, గుర్తింపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

‘కోలిండియా’ కండల వీరుడు మనోడే!

వరుసగా మూడోసారి స్వర్ణం


మిస్టర్ కోలిండియా టైటిల్‌తో రామకృష్ణ..

గోదావరిఖని, కొత్తగూడెం న్యూస్‌టుడే: ‘మిస్టర్ కోలిండియా’గా ఎంపికై ఉన్నతాధికారుల ప్రశంసలందుకున్నారు.. కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన రామకృష్ణ. 2022 నుంచి వరుసగా మూడేళ్లలో మిస్టర్ కోలిండియాగా విజయాన్ని అందుకొని సింగరేణి ఉద్యోగిగా ఖ్యాతి దక్కించుకున్నాడు. ఈ ఏడాది జాతీయస్థాయి పోటీలు గతనెల 28న ఒడిశాలో ముగిశాయి. రామకృష్ణ మాట్లాడుతూ.. ‘మాలాంటి యువ క్రీడాకారులకు సింగరేణి మరింత ప్రోత్సాహం, ఆర్థిక వెసులుబాటు కల్పిస్తే ఏ పోటీల్లోనైనా రాణిస్తాం’ అని అన్నారు. రామకృష్ణ ప్రస్తుతం సత్తుపల్లి జేవీఆర్ ఉపరితల గనిలో అసిస్టెంట్ మైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు.

రెస్క్యూ పోటీల నిర్వహణపై సమీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-2 మైన్స్ రెస్క్యూ స్టేషన్ ఆవరణలో ఈ నెల 16, 17 తేదిల్లో నిర్వహించే 53వ జోనల్ స్థాయి మైన్స్ రెస్క్యూ పోటీల నిర్వహణపై గురువారం జీఎం చింతల శ్రీనివాస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ పోటీలకు సంస్థ సీఎండీ బలరాం హాజరవుతున్నట్లు తెలిపారు. రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, రెస్క్యూ సూపరిండెంట్ మాధవరావుతోపాటూ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రహదారి సమస్యల పరిశీలన


సింగరేణి

గోదావరిఖని: ఓసీపీ-5, ఓసీపీ-3 క్వారీల మధ్యనున్న మార్గానికి అధికారులు అనుమతించకపోవడంపై.. కార్మికుల విజ్ఞప్తి మేరకు జీఎం లలిత్‌కుమార్ స్పందించారు. గురువారం ద్విచక్ర వాహనంపై జీడీకే-5 ఓసీపీ పక్కనుంచి జీడీకే-11 గని వరకున్న మార్గాన్ని పరిశీలించారు. రహదారిని వినియోగంలోకి తీసుకువస్తే కార్మికులకు మేలు చేసినట్లవుతుందని వారు జీఎంకు విన్నవించారు. ఆయన వెంట ఓసీపీ-5 మేనేజర్ అనిల్‌గబాలే, ఐఎన్టీయూసీ నాయకులు సదానందం తదితరులున్నారు.

కార్మికులను సంఘాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి

గోదావరిఖని: లాభాల వాటా విషయంలో కార్మికులను కొన్ని సంఘాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఏఐటీయూసీ నాయకులు సీతారామయ్య ఆరోపించారు. జీడీకే-1 గనిపై గురువారం నిర్వహించిన ద్వార సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 ఏళ్లుగా ఏ విధంగా లాభాల వాటాను పంపిణీ చేస్తుందో అదే మాదిరి ఈ ఏడాది ప్రకటించిందన్నారు. నాయకులు అశోక్, ఎల్లయ్య, స్వామి, పోశం, శ్రీనివాస్, వెంకటరెడ్డి, గౌస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


స్వర్ణలతను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ఉత్తమ సేవలకు అవార్డు

గోదావరిఖని, న్యూస్‌టుడే: మహిళా, వయోవృద్ధుల సంక్షేమ శాఖలో పనిచేసే బాల స్వర్ణలతకు ఉత్తమ ఫీల్డ్ రెస్పాన్స్ అధికారిగా అవార్డు లభించింది. జిల్లా కలెక్టరేట్‌లోని మహిళా, వయో వృద్ధుల సంక్షేమశాఖలో పనిచేసే గోదావరిఖనికి చెందిన స్వర్ణలతకు ఉత్తమ సేవలందించినందుకుగాను.. హైదరాబాద్ రవీంద్రభారతిలో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

విద్యార్థినులకు అవగాహన

గోదావరిఖని, న్యూస్‌టుడే: వేధింపులకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని.. ఆ బృంద ఇన్‌ఛార్జి ఏఎస్ఐ మల్లయ్య సూచించారు. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినిలకు షీటీం బృందం గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. మోసాలపై జాగ్రత్తగా ఉండాలని, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

కొలువుదీరిన అమ్మవారు


కమాన్‌పూర్: ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత


మంథని గాంధీచౌక్‌లో ఆకట్టుకుంటున్న అమ్మవారి రూపం


ముత్తారంలో త్రిపుర సుందరి అవతారంలో..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా దుర్గామాత మండపాలను ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. -న్యూస్‌టుడే బృందం


ఓదెల: కనగర్తిలో..


గౌతమినగర్ కూడలిలో...


గోదావరిఖని మేకల మార్కెట్ సమీపంలో..


జూలపల్లిలో..


కమాన్‌పూర్‌లో..


ధర్మారం: నర్సింహులపల్లిలో..

నేర వార్తలు

రోడ్డు ప్రమాదంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగి దుర్మరణం

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఓదెలకు చెందిన దొమ్మెటి చంద్రయ్య(68) మంచిర్యాలలో ఉంటున్నారు. గురువారం ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తుండగా అల్లీపూర్ సమీపంలో రహదారిపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రాథమిక విచారణ జరిపారు. కాగా చంద్రయ్య ద్విచక్రవాహనంపై నుంచి జారిపడటం వల్ల ప్రమాదం జరిగిందా? లేదా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మానేరులో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలం ఖమ్మంపల్లి వద్ద మానేరులో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్ర చీర, ఎర్ర జాకెట్ ధరించిన సుమారు 60-70 సంవత్సరాల వయసు మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): గోదావరి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రామగిరి ఎస్సై చంద్రకుమార్ గురువారం తెలిపారు. రాజాపూర్ గ్రామం వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని ఠాణాకు తరలించామన్నారు. యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

రేషన్ బియ్యం..

గోదావరిఖని: పట్టణంలోని గంగానగర్, అడ్డగుంటపల్లి ప్రాంతాల్లో 48 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. గోదావరిఖనికి చెందిన విక్రమ్‌తోపాటు మంచిర్యాలకు చెందిన ప్రకాశ్, చిన్నలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉపకేంద్రాల భవనాలకు నిధులు మంజూరు

మంథని, న్యూస్‌టుడే: మంథని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎనిమిది ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద మంథని మండలం ఎగ్లాస్‌పూర్, నాగారం, ముత్తారం మండలం కేశనపల్లి, రామగిరి మండలం బుధవారంపేట, లద్నాపూర్, రత్నపూర్, జల్లారం, వెంకట్‌రావుపల్లి గ్రామాల్లో ఉపకేంద్రాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తామని పీఆర్ డీఈఈ నవీన్‌కుమార్ తెలిపారు.

లాడ్జీల తనిఖీ

గోదావరిఖని: పట్టణంలోని పలు లాడ్జీలను పోలీసులు గురువారం రాత్రి తనిఖీ చేపట్టారు. లాడ్జీలకు వెళ్లి రిజిస్టర్‌లతోపాటు అందులో ఉంటున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చెట్ల పొదలు.. వాహనదారుల వెతలు



బ్రాహ్మణపల్లి-అంతర్గాం రహదారికి ఇరువైపులా చెట్లు పెరిగి.. కొమ్మలు రోడ్డుపైకి వస్తున్నాయి. రామగుండం ఉపరితల వంతెన నుంచి గురుకుల పాఠశాలకు వెళ్లే దారిలోనూ ఇదే తరహాలో చెట్ల పొదలు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

సమగ్రంగా కుటుంబ సర్వే నిర్వహణ

ముత్తారం, న్యూస్‌టుడే: అయిదు రోజుల్లో గ్రామంలోని ప్రతి ఇంటికీ తిరిగి కుటుంబ డిజిటల్ సర్వేను సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. ఫ్యామిలీ డిజిటల్ ప్రాజెక్టు కింద ముత్తారం మండలంలో ఎంపికైన దర్యాపూర్ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. సేకరించిన వివరాలను ఈ నెల 9న స్క్రూటినీ చేసి 10న నివేదిక అందించాలన్నారు. అనంతరం ముత్తారం తహసీల్దారు కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. తహసీల్దారు సుమన్, ఎంపీడీవో సురేశ్, పీఆర్ ఏఈ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


దర్యాపూర్‌లో సర్వే తీరును తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): బేగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శ్రీహర్ష గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించి, ఎన్‌సీడీ సర్వే అమలు తీరును తెలుసుకున్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యుడు ప్రదీప్‌కుమార్‌కు సూచించారు.

సుల్తానాబాద్: కుటుంబ డిజిటల్ కోసం కార్డుల పంపిణీ కోసం వివరాల సేకరణకు గురువారం దుబ్బపల్లిలో అధికారులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఆర్డీవో గంగయ్య పరిశీలించి సూచనలు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లి కలెక్టరేట్: కుటుంబ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా గురువారం పెద్దపల్లి 24వ వార్డులో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. తొలి రోజు 80 కుటుంబాల సర్వే పూర్తయింది. ఆర్డీవో గంగయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ పరిశీలించారు.


దుబ్బపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో గంగయ్య

మంథని: పట్టణంలోని 13వ వార్డులో కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవి ప్రారంభించారు. వైస్ ఛైర్మన్ బానయ్య, ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఖని కళాకారుడికి అవార్డు

గోదావరిఖని: జానపద కళాకారునిగా రాణిస్తూ ప్రతిభ చాటుతున్న అంబాల రాజయ్యకు నేషనల్ యూనిక్ అవార్డు లభించింది. కళారంగంలో సేవలందిస్తున్న వారిని గుర్తించి గోదావరిఖనికి చెందిన రాజయ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు తిరుపతిలోని శ్రీహరి నాట్య నీరాజనం సాంస్కృతిక మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ అకాడమీలకు చెందిన ప్రముఖుల నుంచి అవార్డును స్వీకరించారు.

కుటుంబసభ్యుల వివరాల సేకరణ

పాలకుర్తి: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సన్నాహక సర్వేలో భాగంగా.. మండలంలోని గుడిపల్లి గ్రామంలో గురువారం 161 కుటుంబాల వివరాలను అధికారులు సేకరించారు. అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయనున్నట్లు ఎంపీడీవో శశికళ తెలిపారు.

ఉద్యోగి మృతికి సంతాపం

గోదావరిఖని పట్టణం: రామగుండం నగరపాలికలో జనన, మరణ ధ్రువీకరణ విభాగంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ మాదేసి శ్రీనివాస్ గురువారం అకస్మికంగా మృతి చెందారు. నగర మేయర్ అనిల్‌కుమార్ తోపాటు పలువురు కార్పొరేటర్లు, నగరపాలక అధికారులు శ్రీనివాస్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

సెలవులను కొనసాగిస్తాం

మార్కండేయకాలనీ: ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఆయా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని శాతవాహన విశ్వవిద్యాలయం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఎస్‌యూపీఎంఏ) నాయకులు పేర్కొన్నారు. దసరా సెలవులనంతరం బంద్ పాటించనున్నట్లు సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

విద్యాధికారిణి ఆకస్మిక తనిఖీ

పాలకుర్తి(రామగుండం): వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా ఇంటర్ బోర్డు విద్యాధికారిణి కల్పన సూచించారు. రామగుండం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసినంతరం పలు రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపల్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ బతుకమ్మలకు బహుమతి

గోదావరిఖని: ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో ఉత్తమ వాటికి ఎన్‌సీపీ నాయకులు బహుమతులు అందజేశారు. పవర్‌హౌస్‌కాలనీలో ఉత్తమ బతుకమ్మగా పెసరి భారతి, రాసూరి లక్ష్మికి ద్వితీయ బహుమతి, ఉత్తమ గాయనిగా లక్ష్మమ్మ, ఉత్తమ సంప్రదాయ అలంకరణ రాధలకు బహుమతులు అందజేశారు.

సంఘాలు–కార్యవర్గాలు

ఓదెల: కనగర్తిలో కురుమ సంఘం నూతన కమిటీని సంఘం జిల్లా నాయకుడు ఉడిగె సదయ్య పర్యవేక్షణలో గురువారం ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా మొగిలి కుమార్, ఉపాధ్యక్షులుగా కచ్చు పరశురాములు, మొగిలి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మొగిలి లింగమూర్తి తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

అన్నదాతలకు అవగాహన

పాలకుర్తి(అంతర్గాం): ఆయిల్‌పామ్ పంటల సాగు, సబ్సిడీలపై ఇస్సంపేటలో మండల వ్యవసాయాధికారి సతీష్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ మొక్కలపై 90 శాతం, డ్రిప్ పరికరాలపై 80 నుంచి 90 శాతం సబ్సిడీ, అంతరపంట సాగుకు ఏడాదికి రూ.4200 ప్రోత్సాహకంగా ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏఈవో రమేష్, కంపెనీ ప్రతినిధి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ముత్తారం: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి జ్యోతి తిరుమల అన్నారు. ముత్తారం మండలం శుక్రవారంపేటలోని బూర్ల లక్ష్మి వ్యవసాయ క్షేత్రంలో గురువారం మొక్కలు నాటిన సందర్భంగా అధికారులు స్థానిక రైతులకు సాగుకు సంబంధించి సూచనలు చేశారు. సాగు ఖర్చుల కింద ఏడాదికి రూ.4200 చొప్పున ఉద్యాన శాఖ అందిస్తుందన్నారు. డివిజన్ అధికారి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

ఓదెల: బతుకమ్మ, దసరా వేడుకలను స్నేహపూర్వక వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు సహకరించాలని, గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బేగంపేటలో డీఎల్‌పీవో పర్యటన

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): బేగంపేటలో గురువారం మంథని డీఎల్‌పీవో సతీశ్ పర్యటించారు. కుమ్మరివాడలో పర్యటించి మురుగు కాలువపై నెలకొన్న వివాదంపై స్థానికులతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ రాంచందర్‌రావు, ఎంపీవో ఉమేశ్, కార్యదర్శి రత్నాకర్ పాల్గొన్నారు.

భారాస నేతలపై విమర్శలు సరికాదు

కమాన్‌పూర్: భారాస నేతలపై అర్థరహిత విమర్శలు మానుకోవాలని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం కమాన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు సంపత్ యాదవ్, పొన్నం రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం ఎస్సైకి సన్మానం

ధర్మారం: రాష్ట్ర స్థాయిలో ధర్మారం ఠాణాకు అయిదో ర్యాంకు వచ్చిన సందర్భంగా ఎస్సై శీలం లక్ష్మణ్‌ను గురువారం మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడి ఉత్సవ సేవ

ధర్మపురి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి అశ్వ వాహన సేవను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. వివిధ రకాల పూలతో ఉత్సవ మూర్తులను అలంకరించి, మేళతాళాలతో సేవను తిప్పారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు. దేవస్థానానికి గురువారం రూ. 95,140 ఆదాయం సమకూరినట్లు తెలిపారు.


వీధుల్లో స్వామివారి ఊరేగింపు

మహిళలను కించపరిచేలా మంత్రి వ్యాఖ్యలు

మంథని: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు మహిళా లోకాన్ని కించపరిచేలా ఉన్నాయని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ శైలజ, భారాస నాయకురాళ్లు పేర్కొన్నారు. గురువారం వారు మంథనిలో విలేకరులతో మాట్లాడుతూ తనపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసిన మంత్రి మరో మహిళ గురించి మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు.